
జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి..
చదివించండి
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
ఎడిటర్: చౌదరి, 9963063761



శనివారం | 10-10-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 805 పేజీలు: 4 వెల : రూ.7


## ఓట్లప్పుడు.. దండాలు..

# చావుకొస్తే దగా!

- శతాబ్ద కాలంగా శవాలతో దళిత కుటుంబాల నరకయాతన? ✳ స్మశానానికి దారి లేదు..
- కలగానే కమ్యూనిటీ హాల్? ✳ పారాపురం, కొత్తూరు సరిహద్దు దళితుల రోదనలు పట్టవా?
- పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల బహిష్కరిస్తామని గ్రామస్థుల హెచ్చరిక



కొత్తూరు, అక్టోబర్ 9 (వార్త): ఎన్నికలొస్తే చాలు.. చేతులు జోడించి కల్లబొల్లి మాటలు చెప్పడం.. గెలిచాక దళితవాడల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం.. దశాబ్దాలుగా నాయకులు ఆడుతున్న ఈ రాజకీయ నాటకానికి శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలంలోని దళితులు బలవుతున్నారు. మనిషి బతికి ఉన్నప్పుడే కాదు, చనిపోయాక కూడా గౌరవంగా సాగనంపేందుకు కనీస రహదారి సౌకర్యం లేక కొత్తూరు సరిహద్దు పారాపురం గ్రామాల దళిత ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారాపురం గ్రామం, కొత్తూరు బౌండరీ పరిధిలో సుమారు 250 కుటుంబాలు, 500 మందికి పైగా దళిత ఓటర్లు వందేళ్లుగా కలిసిమెలసి జీవిస్తున్నారు. వీరందరికీ కలిపి ఉన్న ఏకైక స్మశాన వాటికకు వెళ్లడానికి నేటికీ దారి లేదు. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియలు నిర్వహించేందుకు శవాన్ని భుజాలపై మోస్తూ, ముళ్లకంపలు, రాళ్లగుట్టల మధ్య పడే నరకయాతన వర్ణనాతీతం. "తరాలు మారుతున్నాయి.. నాయకులు మారుతున్నారు.. కానీ మా శవాల మోతకు దారి దొరకడం లేదు" అని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. గతంలో ఎలాగడ చెరువు గట్టు పక్కన స్మశాన వాటికకు 12 సెంట్లు, దళిత కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 10 సెంట్లు భూమి కేటాయించారు. ఆ స్థలాన్ని గ్రామస్థులే కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారు. అయితే, గత ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ఆ స్థలాల అభివృద్ధి పేరిట కాగితాలపై పనులు చూపించి స్వార్థ రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో రూపాయి పని కూడా చేయలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సర్పంచ్, ఎంపీటీసీ మొదలుకొని ఎమ్మెల్యే స్థాయి వరకు ఎన్నికలొచ్చినప్పుడు ఇచ్చిన హామీలు గెలిచాక బూడిదలో పోసిన పన్నీరయ్యాయని మండిపడుతున్నారు.

### ఎమ్మెల్యే గారూ..
### మా ఆర్తనాదాలు వినండి...!

ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, మండల ఉన్నతాధికారులు స్పందించి పారాపురం-కొత్తూరు దళితుల దీర్ఘకాలిక సమస్య అయిన స్మశానవాటిక రహదారి, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలను తక్షణమే చేపట్టాలని దళిత పెద్దలు డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికీ అలసత్వం ప్రదర్శిస్తే రానున్న రోజుల్లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని, భవిష్యత్ ఎన్నికలను సంపూర్ణంగా బహిష్కరిస్తామని ముక్తకంఠంతో హెచ్చరించారు. ఈ నిరసనలో దళిత గ్రామ పెద్దలు కింజరాపు సింహాచలం, గర్భక రామారావు, కొర్ర రవి, యందవ జీవ, రీసి రామకృష్ణ, తూత సవరయ్య, వజ్రగడ్డ కృష్ణారావు, బొడ్డేపల్లి సుందరరావు, దార రాము, కళ్లపల్లి ఆనందరావు, జర్జన తిరుపతిరావు, యాళ్ల సుందరరావు, లోపింటి వెంకటరమణరావుతో పాటు అంబేద్కర్ భీమ్ సేన నాయకులు ఊర్జన రాజీవ్, జర్జన విజయ్, వికాస్, గువ్వాడ కృష్ణ, రీసి శంకరరావు, తూత శంకరరావు, సవలాపురపు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



## గంజాయితో ప్రేమికుల అరెస్ట్



ఇచ్ఛాపురం, అక్టోబర్9 (వార్త): ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ సమీపంలో 14.100 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు ప్రేమికులను టౌన్ ఇన్ ఛార్జ్ ఎస్ఐ ఆర్.జనార్దన్ రావు అరెస్ట్ చేసినట్లు సీఐ ఎం.చిన్నం నాయుడు చెప్పారు. ఒడిశాలోని బరసరాకి చెందిన రీనా పరిడా(28), కోదలా గ్రామానికి చెందిన సిటు ప్రధాన్(34) ఇద్దరు ప్రేమికులను అదుపులోకి తీసుకుని గంజాయి సీజ్ చేసినట్లు చెప్పారు. సీఐ చెప్పిన వివరాలు ప్రకారం రీనా, సిటు ప్రేమికులు కాగా డబ్బులు అవసరమై గంజాయి వ్యాపారం చేసే లక్ష్మీ కాంత్ గౌడ అలియాస్ టుట్టుకి చెప్పగా గుజరాత్‌లోని సూరత్‌లో వ్యాపారికి అప్పగిస్తే కిలోకి 6 వేలు రూపాయలు ఒప్పందం కుదుర్చుకుని గంజాయిని బైక్‌పై తరలిస్తూ ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కి వచ్చేందుకు ప్రయతించగా అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

### అచ్చెన్నకు అనుకూలంగా పనిచేస్తున్న..
## అధికారులను తొలగించాలి

- కొందరు ఓటర్లను భయభ్రాంతులను చేస్తున్నారు ✳ వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెడుతున్నారు ✳ అధికారులను బదిలీ చేయకపోతే టెక్కలిలో ర్యాలీ చేస్తాం ✳ స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి ✳ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ✳ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం



సంతబొమ్మాళి, అక్టోబర్ 9 (వార్త): స్థానిక ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలంటే మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు అనుకూలంగా వ్యవహరి స్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులను ఎన్నికలకు ముందే బదిలీ చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ డిమాండ్ చేశారు. శుక్ర వారం సంతబొమ్మాళి మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్య కర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి అండతో కొందరు అధికారులు ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తూ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని తిలక్ ఆరోపించారు. సంబంధిత అధికారులను బదిలీ చేయకపోతే టెక్కలిలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. గతంలోనూ అధికారుల తీరుపై ప్లకార్డులతో నిరసన తెలిపామని గుర్తుచేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని తిలక్ పిలుపునిచ్చారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన వారిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తుంచుకుంటారని, పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం 143 హామీలతోపాటు సూపర్ సిక్స్ పథకాల హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కోటపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కొయ్యన సంజీవరావు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, పార్టీ గుర్తింపు కార్డు ఉన్నందున రూ.5 లక్షల బీమా సాయం అందుతుందని తిలక్ తెలిపారు. రెయ్యిపేట గ్రామానికి చెందిన కార్యకర్త రెయ్యి ఆనందరావు మృతితో ఆ కుటుంబాన్ని పార్టీ నాయకులు ఆదుకోవాలని కోరారు.

## మొగదలపాడును పర్యాటక కేంద్రంగా..
# తీర్చిదిద్దుతాం

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- మొగదలపాడు గ్రామానికి వందేళ్ల తర్వాత రెవెన్యూ సమస్యకు పరిష్కారం ✳ ఎమ్మెల్యేతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
- నూతన భవనాలు ప్రారంభం

శ్రీకాకుళం, అక్టోబర్ 9 (వార్త): కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శుక్రవారం శ్రీకాకుళం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసి, నూతన భవనాలను ప్రారంభించారు. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడులో అమృత్ 2.0 పథకం కింద 25.34 కోట్లతో 1,200 కిలోలీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సింగుపురం కేజీబీవీ పాఠశాలలో 2.12 కోట్లతో నిర్మించిన అదనపు గదులు, డార్మిటరీ భవనాలను, గార మండలం శాలిహుండం కేజీబీవీ పాఠశాలలో 2.55 కోట్లతో నిర్మించిన డార్మిటరీ గదులను ప్రారంభించారు. అనంతరం గార మండలం మొగదలపాడులో గ్రామస్థులకు రెవెన్యూ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దాదాపు వందేళ్లుగా సర్వే, రెవెన్యూ రికార్డులు, భూమి యాజమాన్య ఆధారాలకు సంబంధించి సమస్యలు ఎదుర్కొంటున్న గ్రామానికి పరిష్కారం లభించడం ఆనందంగా ఉందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చించి, పరిష్కారానికి కృషి చేశామని తెలిపారు. ఈ సమస్య పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన ఎమ్మెల్యే గొండు శంకర్‌ను అభినందించారు. మిగిలిన అర్హులైన గ్రామస్థులకు కూడా త్వరలో పట్టాలు అందించాలని సూచించారు. మొగదలపాడు గ్రామం తెలుగుదేశం పార్టీకి ఎన్టీఆర్ కాలం నుంచి అండగా నిలుస్తోందని, గ్రామ ప్రజల చిరకాల సమస్య పరిష్కారం కావడంతో పండుగ వాతావరణం నెలకొందని మంత్రి అన్నారు. గ్రామంలో మత్స్యకారులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గంగమ్మతల్లి ఆశీస్సులతో మొగదలపాడు తీర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, బీచ్ రోడ్డు, సోలార్ లైటింగ్, పర్యాటకులకు అనువైన రిసార్ట్, స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రౌండ్ వంటి సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. నిన్నటి వరకు మ్యాప్‌లో పెద్దగా గుర్తింపు లేని ఈ ప్రాంతం, రానున్న రోజుల్లో జిల్లా ప్రజలు వెతుక్కుంటూ వచ్చే పర్యాటక గమ్యస్థానంగా మారాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తీరప్రాంత వనరులను సద్వినియోగం చేసుకొని మత్స్యకార యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, కొత్త సంస్థలకు ప్రజలు సహకరించి, అందుబాటులోకి వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్ర, జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ప్రశంసించారు. మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, అసాధ్యమనుకున్న సమస్యలకు సైతం పరిష్కారం చూపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు

**-బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి తెదేపా కట్టుబడి ఉంది**

**-వైఎస్సార్‌సీపీ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంపై గౌతు శిరీష ప్రశ్నలు**



**పలాస, అక్టోబరు 9 (వార్త):** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు బీసీలు పార్టీ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు తెదేపా నిరంతరం కృషి చేస్తోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. టిడిపి కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో తమ పార్టీ వెనక్కి తగ్గబోదని స్పష్టం చేశారు. బీసీలపై ప్రేమ ఉందని చెబుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించే అంశంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ ఎంతోమంది బీసీ నాయకులను రాజకీయంగా ప్రోత్సహించిందని గౌతు శిరీష తెలిపారు. గతంలో బీసీలకు 20 శాతం నుంచి 34 శాతం వరకు రిజర్వేషన్లు కల్పించే దిశగా తెదేపా కృషి చేసిందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రిజర్వేషన్లు తగ్గడం వల్ల సుమారు 16,800 మంది బీసీలు రాజకీయ ప్రాతినిధ్యానికి దూరమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే నిర్ణయంపై వైఎస్సార్ సీపీ న్యాయస్థానాలను ఆశ్రయించడంపై ఆ వర్గాలు ఆలోచించాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ నిర్ణయాలతో సంబంధం లేకుండా తమ పార్టీ తరఫున బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇప్పటికే ప్రకటించినట్లు గౌతు శిరీష వెల్లడించారు. ఆ హామీకి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం, అభ్యున్నతి కోసం భవిష్యత్తులోనూ కృషి చేస్తామని తెలిపారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంలో కేంద్ర స్థాయిలో ఆటంకాలు ఎదురైనా, తమ పార్టీ ఇచ్చిన హామీకి కట్టుబడి ఉంటుందని యువ నాయకుడు నారా లోకేశ్ మహానాడు వేదికగా ప్రకటించారని గుర్తుచేశారు. 2029 నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని వెల్లడించిన విషయాన్ని ప్రస్తావించారు. బీసీలను వెనుకబడిన వర్గాలుగా మాత్రమే కాకుండా, పార్టీకి వెన్నెముకగా భావిస్తున్నామని గౌతు శిరీష తెలిపారు. కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. బీసీల ప్రయోజనాలు, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశాలపై ప్రజలు వాస్తవాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## నేత్ర వైద్య శిబిరాల్లో విద్యార్థులకు పరీక్షలు




**మందస, అక్టోబరు 9(వార్త):** మందసలోని వివేకానంద విద్యానికేతన్, బాలిగాం పంచాయతీలోని రంగనాథపురం సమీపంలో గల జార్జి మెమోరియల్ స్కూల్ లలో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులకు మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేత్ర వైద్య సహాయాధికారి రోణంకి వెంకటరమణ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు జరిగాయి. జాతీయ ఆంధత్వ నివారణ కార్యక్రమం లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంఘం, చైర్మన్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు ప్రకారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని వెంకటరమణ చెప్పారు. అనంతరం నేత్ర వైద్య సహాయాధికారి వెంకటరమణ మాట్లాడుతూ కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కంటి వ్యాధులు, నేత్ర సంరక్షణపై పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్ ను అతిగా వినియోగించవద్దని, దీంతో కంటికి కలిగే సమస్యలను వివరించారు. కార్యక్రమంలో వివేకానంద విద్యానికేతన్ ప్రధానోపాధ్యాయుడు బొడ్డపాటి కామేశ్వరరావు, బోర ఉమాపతి, జార్జి మెమోరియల్ స్కూల్ ఉపాధ్యాయులు పి.సాయికుమార్, ఎన్.విజయలక్ష్మి, హెల్త్ సెక్రటరీ, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి



**మందస, అక్టోబరు 9(వార్త):** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శ్రీకాకుళం జిల్లా జేఏసి చైర్మన్ కింతల శంకరరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం జేఏసీ ముఖ్య నాయకులందరూ పాల్గొని విద్యుత్ శాఖాధికారులకు వినతిపత్రలు అందజేశారు. మందస, పలాస, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు, సోంపేట మండలాల పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు పలాస ఈఈ. పలాస డీఈఈ, సోంపేట డీఈఈలకు, ఆయా సెక్షన్ పరిధిలోని ఏఈలకు తమ సమస్యలను విన్నవించారు. 132కేవీ ఇచ్ఛాపురం, పలాస 132 ఏఈలకు కూడా వినతిపత్రాలను అందజేశారు. జేఏసీ కార్యచరణలో భాగంగా సమస్యలను వివరిస్తూ ఎన్నో ఏళ్లుగా విలీనం, సమాన పనికి సమాన వేతనం, 100% హెల్త్ కార్డులు, కోటి రూపాయలు ప్రమాద బీమా. రిటైర్మెంట్ గ్రాడ్యుటి బెనిఫిట్ 10 లక్షల రూపాయలు, సర్వీస్ లో ఉన్న వ్యక్తి సహజ మరణం, ఆనారోగ్యంతో కానీ మరణిస్తే విద్యుత్ కార్మికుడికి 50 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలన్నారు. సర్వీస్ వెయిటేజ్ ప్రాతిపదిక 5నుండి పై 30సంవత్సరాలు సర్వీస్ ఇనిస్ట్యు వర్తింపు చేయాలని, డీఏ పునరుద్దరణ కార్మికులకు వర్తింప చేయాలన్నారు. కార్యక్రమంలో 106 యూనియన్ ఫౌండర్, అధ్యక్షుడు, స్టేట్ జేఏసి ఎగ్జిక్యూటివ్ మెంబర్, శ్రీకాకుళం జిల్లా జేఏసీ చైర్మన్ కింతల శంకరరావు, పట్టా రామచంద్రరావు 106 యూనియన్ కార్యదర్శి, చీఫ్ కోఆర్డినేటర్, కన్వీనర్ జి.లక్ష్మణ రావు, జనరల్ సెక్రటరీ పాపారావు మద్దిల, చీఫ్ కో ఆర్డినేటర్ ఇర్రి రామారావు, వైస్ చైర్మన్ ఎన్.శివప్రసాద్, సెక్రటరీ బి.వెంకటరమణ, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరావు, కమ్యూనికేషన్ సెక్రటరీ వై.ప్రదీప్ కుమార్, కోఆర్డినేటర్ ఆర్.మురళిప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.అప్పలరాజు, అడిషనల్ సెక్రటరీ జి.శ్రీనివాసరావు, జేఏసీ ట్రెజరర్ జి.కిరణ్ కుమార్, డివిజన్ కోశాధికారి ఈ.హరీష్, అవినాష్. ప్రవీణ్, రుద్ర తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పరిశీలన



**జలుమూరు, అక్టోబరు 9 (వార్త):** కొండపోలవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారులు బమ్మిడి మాధవరావు, ఎంఈఆర్ఎస్ ప్రసాదరావు శుక్రవారం సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి గణితంలో వారి నైపుణ్యాలను, భాషా పఠన సామర్థ్యాలను సమీక్షించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను ఎంతవరకు అర్థం చేసుకుంటున్నారో తెలుసుకున్నారు. అనంతరం ఎఫ్ఏ-2 పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలను తనిఖీ చేసి విద్యార్థుల విద్యా ప్రగతిని అంచనా వేశారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని గుర్తించి, అవసరమైన అంశాల్లో మరింత మెరుగైన బోధన అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంచుతూ, ప్రాథమిక నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. దసరా సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు తగిన హోంవర్క్ ఇవ్వడంతో పాటు విలువల విద్య పుస్తకాలను పంపిణీ చేయాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు. సెలవుల సమయంలోనూ విద్యార్థులు చదువుపై ఆసక్తి కొనసాగించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌కు టీడీపీ కట్టుబడి ఉంది



**ఇచ్ఛాపురం, అక్టోబరు 9 (వార్త):** చట్టపరంగా బీసీలకు న్యాయం చేయలేకపోయినా, పార్టీ పరంగా బీసీలకు న్యాయం చేస్తామని,వైసీపీ నేతలు కోర్టుకు వెళ్లి 34 శాతం రిజర్వేషన్లను అడ్డుకుని బీసీలకు తీరని ద్రోహం చేశారని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు విలేకరుల సమావేశం లో మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పిస్తాం. బీసీల రాజకీయ ఎదుగుదలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదగకూడదని గొడ్డలి పార్టీ నేతలు కుట్రలు చేస్తున్నారని, బీసీలకు న్యాయం చేయాలన్నదే టీడీపీ లక్ష్యం అని వారి హక్కులను అడ్డుకోవడమే వైసీపీ వైఖరి అని అన్నారు. బీసీల హక్కుల కోసం టీడీపీ నిరంతరం పోరాడుతుందని వారి అభ్యున్నతికి కట్టుబడి ఉంటుందని అన్నారు.

# పేదరికం లేని పల్లెలే ప్రభుత్వ ధ్యేయం



**మందస, అక్టోబరు 9(వార్త):** సమాజంలో పేదరికం లేని పల్లెలే కూటమి ప్రభుత్వధ్యేయమని వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు చెప్పారు. మందస పట్టణంలోని వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య కోశాధికారి మెట్ట శారద ఆధ్వర్యంలో శుక్రవారం జీరో పావర్టీపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వెలుగు సిబ్బంది వి.ఓ.ఏ.లు, మండల పరిధిలో గల 60 గ్రామ సంఘాల ప్రతినిధులు తో ఏర్పాటు చేసిన ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని ఏపీఎం కూర్మారావు మాట్లాడారు. ప్రభుత్వం సెర్ప్ సంస్థ ద్వారా అర్హత గల మహిళా సంఘాలు, ప్రాసెసింగ్, ప్రొడ్యూసర్ గ్రూప్స్, మహిళా రైతులకు వారి పెట్టుబడి అవసరాలకు అనుగుణంగా తక్కువ వడ్డీ కి వివిధ రకాల రుణాలను అందిస్తూ ఎంటర్ ప్రైనర్ లు గా తయారు కావడానికి ప్రభుత్వం సహకరిస్తున్నప్పటికీ, మందస మండలంలోని కొన్ని గ్రామాల్లో వెనుకబడడానికి కొంతమంది సిబ్బంది అలసత్వం కాదా ? అని ప్రశ్నిస్తూ...విషయం అందరికీ అర్థమైనట్లు వివరించారు. సకాలంలో ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను గ్రామ స్థాయిలో మీటింగ్స్ జరిపి అవగాహన కల్పించకుండా నిర్లక్ష్యంతో నటించే సిబ్బందిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. స్వర్ణాంధ్ర విజన్ లో భాగంగా జీరో పావర్టీ మిషన్ అత్యంత నిరుపేద కుటుంబాల ఎంపిక బాధ్యత మన గ్రామ సంఘాల కు అప్పగించిందని తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు, అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు, వి.ఓ.ఏ.లు, క్లస్టర్ కోఆర్డినేటర్లు, లీగల్ కోఆర్డినేటర్ తారక మోహన్, అకౌంటెంట్స్ కళ్యాణి, భాగ్యలక్ష్మి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే గ్రామ సమస్యల పరిష్కారం



**జలుమూరు, అక్టోబరు 9 (వార్త):** గ్రామాల్లో సమస్యలు తలెత్తినప్పుడు గ్రామస్థులంతా ఐక్యంగా మెలుగుతూ వాటి పరిష్కారానికి సహకరించాలని సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ బి.అశోక్‌బాబు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం రాత్రి జలుమూరు మండలం టెక్కలిపాడు గ్రామంలో నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో వారు పాల్గొని గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే పరస్పర సహకారంతో పరిష్కరించుకోవాలని తెలిపారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేందుకు గ్రామస్థులందరూ సహకరించాలని సీఐ, ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి వివాదాలకు, ఘర్షణలకు పాల్పడకుండా సంయమనం పాటించాలని సూచించారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు.

# సాఫ్ట్‌బాల్ కోచింగ్ కేంద్రానికి వైద్యుడి రూ.లక్ష విరాళం

**- నరసన్నపేట పీఎంశ్రీ పాఠశాల క్రీడాకారులకు ఆర్థిక చేయూత**

**- పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి ముందడుగు**

**- వైద్యుడు బలగ మురళిని సన్మానించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు**



**నరసన్నపేట, అక్టోబరు 9 (వార్త):** నరసన్నపేట పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సాఫ్ట్‌బాల్ కోచింగ్ కేంద్రానికి పూర్వ విద్యార్థి, ప్రముఖ వైద్యుడు బలగ మురళి రూ.లక్ష విరాళంగా అందజేశారు. తాను చదువుకున్న పాఠశాలకు తన వంతు సేవ చేయాలనే సంకల్పంతో ఆయన ముందుకు వచ్చి క్రీడాకారులకు ఆర్థిక సహకారం అందించారు. ఈ పాఠశాలలో నిర్వహిస్తున్న సాఫ్ట్‌బాల్ కోచింగ్ కేంద్రంలో పలువురు విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. క్రీడల్లో విద్యార్థులు రాణించేందుకు అవసరమైన ప్రోత్సాహం, సదుపాయాల కల్పనలో భాగంగా బలగ మురళి ఈ విరాళాన్ని అందించడం పట్ల పాఠశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఆయన అందించిన ఆర్థిక సహకారం కోచింగ్ కేంద్రం నిర్వహణకు, విద్యార్థుల క్రీడా ప్రతిభను మరింత మెరుగుపరచేందుకు తోడ్పడనుంది. చదువుకున్న విద్యాసంస్థ పట్ల కృతజ్ఞతాభావంతో ముందుకు వచ్చి సేవ చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు తమ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తే విద్యార్థులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు వీలవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూపవతి, ఉపాధ్యాయులు బలగ మురళిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల క్రీడా అభివృద్ధికి ఆయన అందించిన సహకారాన్ని ప్రశంసించారు.

# మండల ప్రజా ప్రతినిధులకు ఘన సన్మానం

**సంతబొమ్మాళి, అక్టోబరు 9(వార్త):** జడ్పీటీసీ సభ్యులు పాల వసంతరెడ్డి, ఎంపీపీ మెరుగు రాజేశ్వరి, అప్పారావు, వైస్ ఎంపీపీలు నక్క చింతామణి , పొందల తుల సమ్మతో పాటు పలువురు మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులను వైసీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ శనివారం సంతబొమా&ళిలో జరిగిన సమావేశంలో శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. తొలుత మృతిచెందిన పార్టీ కార్యకర్తలకు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, మాజీ జడ్పిటిసి పాల వసంతరెడ్డి, పార్టీ సహాయ కార్యదర్శి కెల్లి జగన్నాయకులు, పి.రవికుమార్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి, కోత సతీష్, నక్క భీమారావు, పి.రామ కృష్ణ, మార్పు అశోక్ చక్రవర్తి, పరపటి శ్రీనివాసరెడ్డి, ఎన్ని మన్మథరావు, జోగి రాము లమ్మ, మార్పు నాగభూషణరావు, కొన్న శ్రీరాములు, సిమ్మ సోమేశ్, కే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

**- రావాడపేట కాలనీలో సమస్యల పరిష్కారం కోసం వైసీపీ నేత ధర్మాన కృష్ణ చైతన్య ధర్నా**

**- తాగునీరు, రహదారులు, మురుగు కాలువలు, శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని డిమాండ్**

**- కాలనీవాసుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ**



**నరసన్నపేట, అక్టోబరు 9 (వార్త):** నరసన్నపేట మండలం రావాడపేటలోని జగనన్న కాలనీలో నివసిస్తున్న ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధర్మాన కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తమ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు జగనన్న కాలనీ ద్వారా ఇళ్ల స్థలాలు అందించామని ధర్మాన కృష్ణ చైతన్య తెలిపారు. అయితే ప్రస్తుతం కాలనీలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనలో కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతోందని విమర్శించారు. కాలనీలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో పాటు రహదారులు, మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు ఆయనకు వివరించారు. ముఖ్యంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశానవాటిక కూడా లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయని, వెంటనే స్థలం కేటాయించి శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాలనీకి అవసరమైన రహదారులు, తాగునీటి సౌకర్యం కల్పించి, మురుగునీటి పారుదలకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. కాలనీలో పర్యటించి సమస్యలను స్వయంగా గుర్తించినట్లు ధర్మాన కృష్ణ చైతన్య తెలిపారు. ప్రజలకు అవసరమైన కనీస వసతులు కల్పించకపోవడం విచారకరమని పేర్కొంటూ, ఈ సమస్యలన్నింటినీ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీవాసులకు మౌలిక సదుపాయాలు కల్పించే వరకు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

## ఈదులవలస మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్‌గా తాతమ్మ

**- వైస్ చైర్మన్‌గా కొంగరాపు గణేశ్ ఎన్నిక**



**పోలాకి, అక్టోబరు 9 (వార్త):** పోలాకి మండలం ఈదులవలస ఏపీ మోడల్ స్కూల్ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో ఛైర్మన్‌గా మెండ తాతమ్మ, వైస్ ఛైర్మన్‌గా కొంగరాపు గణేశ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ పాఠశాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించే దిశగా పనిచేయాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. పాఠశాల కమిటీలో మొత్తం 15 మంది సభ్యులు ఉండగా, వారిలో 11 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) సానుభూతిపరులు, నలుగురు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సానుభూతిపరులు ఉన్నట్లు తెలిసింది. కమిటీ ఎన్నికల ఫలితాలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎన్నికల్లో విజయం సాధించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, రెండేళ్ల పదవీకాలంలో పాఠశాల అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, విద్యా ప్రమాణాల పెంపునకు అవసరమైన చర్యలు చేపట్టడంపై దృష్టి సారించాలని ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తే పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించవచ్చని తెలిపారు. నూతన కమిటీ సభ్యులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించి పాఠశాల పురోగతికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## సూర్యోదయ స్కూల్ విద్యార్థి వికాస్ ప్రతిభ

**మందస, అక్టోబరు 9(వార్త):** మందసలోని సూర్యోదయ స్కూల్ విద్యార్థి వికాస్ కార్జి ప్రతిభ చూపాడు. 2026--27 విద్యా సంవత్సరానికి నవోదయ సీటు పొందాడు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ మోణింగి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ పిల్లి లోకేశ్వరరావు మాట్లాడుతూ మందస మండలంలో అగ్నిగంగా వారి సూర్యోదయ స్కూల్ మరోసారి తన విజయపతాకాన్ని ఎగురవేసిందన్నారు. మా విద్యార్థి వికాష్ కార్జి ప్రతిష్టాత్మక నవోదయ విద్యాలయంలో సీటు సాధించి, పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడన్నారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన వికాష్‌కు, తల్లి,దండ్రులకు వికాస్ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. విజయమే మా సంప్రదాయమని, విద్యార్థుల భవిష్యత్తే మా లక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థి వికాస్ కార్జి, తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# తండ్రిగా గర్వపడుతున్నా.. శిరీషను చూసి ఆనందిస్తున్నా!

**-ఎర్రన్నాయుడు నాడు.. శిరీష నేడు!**

**-రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడంపై శివాజీ భావోద్వేగం**

**-తండ్రి మాటలకు కంటతడి పెట్టిన ఎమ్మెల్యే శిరీష**

**-విమర్శకులపై శివాజీ వ్యంగ్యాస్త్రాలు**

**పలాస, అక్టోబరు 9 (వార్త):** రాజకీయాల్లో ప్రజాభిమానం, ప్రత్యేక గుర్తింపు సాధించడం అంత సులభం కాదని, ప్రజల కోసం పనిచేసినప్పుడే ఆ గౌరవం లభిస్తుందని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ వ్యాఖ్యానించారు. ఒకప్పుడు దివంగత నేత ఎర్రన్నాయుడు, తాను స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించిన సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందామని గుర్తుచేశారు. ఇప్పుడు తన కుమార్తె, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సైతం రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని, తండ్రిగా గర్వపడుతున్నానని భావోద్వేగంగా పేర్కొన్నారు. పలాసలో రైల్వే పైవంతెన ప్రారంభోత్సవ సభలో శివాజీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తన కుమార్తె ఎదుగుదలను చూసి ఇన్నాళ్లూ ఆనందించానని, ప్రస్తుతం ఆమె సాధిస్తున్న గుర్తింపు తనలో తండ్రిగా మరింత గర్వాన్ని నింపుతోందని ఆయన పేర్కొనడం సభికులను ఆకట్టుకుంది. తండ్రి తనపై వ్యక్తం చేసిన అభిమానాన్ని, గర్వాన్ని విన్న ఎమ్మెల్యే గౌతు శిరీష భావోద్వేగానికి గురై కంటతడి పెట్టడం సభలో ప్రత్యేకంగా నిలిచింది. నాడు ఎర్రన్నాయుడు.. నేడు శిరీష

రాజకీయ ప్రస్థానంలో ప్రజల ఆదరణతో ప్రత్యేక స్థానం సంపాదించుకోవడం గొప్ప విషయమని శివాజీ వ్యాఖ్యల ద్వారా స్పష్టమైంది. గతంలో ఎర్రన్నాయుడు, తాను సాధించిన గుర్తింపును ప్రస్తావిస్తూ, ప్రస్తుతం తన కుమార్తె అదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందడం కుటుంబానికి గర్వకారణమని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో వారసత్వం ఒక్కటే విజయానికి కొలమానం కాదని, ప్రజల్లో ఆదరణ పొందుతూ, తనదైన కార్యాచరణతో గుర్తింపు సాధించాల్సి ఉంటుందనే భావన ఆయన మాటల్లో ప్రతిబింబించింది.



### విమర్శలకు వాస్తవాలే సమాధానం

తనను, తమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నవారిపైనా శివాజీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నిజాలను యథాతథంగా రాయలేని పరిస్థితులు ఉన్నాయంటూ వ్యాఖ్యానించారు. "నిజం రాస్తే తల పగిలిపోద్ది.. చెయ్యి విరిగిపోద్ది" అంటూ వక్రంగా రాస్తున్నారనే అర్థం వచ్చేలా విమర్శకుల తీరుపై సెటైర్లు వేశారు. విమర్శలను పట్టించుకోకుండా ఉండటమే కాకుండా, అవసరమైన సందర్భాల్లో వాస్తవాలను ప్రజల ముందుంచి సమాధానం చెప్పాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

### అభివృద్ధిపై చర్చకు సిద్ధం కావాలి

గతంలో అభివృద్ధి అంశాలపై చర్చకు రావాలని, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులతో సహా తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ చేసినప్పటికీ ప్రత్యర్థులు ముందుకు రావడం లేదని శివాజీ విమర్శించారు. చర్చకు నేరుగా హాజరుకాకుండా ఇతరులను పంపుతూ తప్పించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయ విమర్శలకు ప్రతివిమర్శలతోనే పరిమితం కాకుండా, అభివృద్ధికి సంబంధించిన వాస్తవాలు, ఆధారాలను ప్రజలకు వివరించడం ముఖ్యమని అన్నారు.

### వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాజకీయాల్లో విమర్శలు సహజమని, అయితే వాటికి సమాధానం చెప్పే క్రమంలో వాస్తవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని శివాజీ పార్టీ శ్రేణులకు హితవు పలికారు. ఏం జరిగినా ప్రజలకు నిజానిజాలు తెలియజేస్తూ ఉండాలని, అభివృద్ధి పనులు, వాటి వెనుక ఉన్న కృషి, సాధించిన ఫలితాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వాస్తవాలను నిరంతరం ప్రజలకు వివరిస్తే కచ్చితమైన ఫలితాలు ఉంటాయని ఆయన తెలిపారు. ఒకవైపు కుమార్తె రాజకీయ ఎదుగుదలపై తండ్రిగా గర్వాన్ని వ్యక్తం చేస్తూ, మరోవైపు విమర్శకులకు వాస్తవాలతో సమాధానం చెప్పాలంటూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన శివాజీ వ్యాఖ్యలు పలాస పైవంతెన ప్రారంభోత్సవ సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## రైతుల సంక్షేమమే లక్ష్యం



**మెళియాపుట్టి, అక్టోబరు 9 (వార్త):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలో గల గొప్పిలి గ్రామంలో ప్రభుత్వం రాజముద్రతో ముద్రించిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు శుక్రవారం నాడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి హక్కులకు సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేయడం ద్వారా రైతులకు తమ భూముల పై మరింత భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రైతులకు భూమి హక్కుల పరిరక్షణతోపాటు ప్రభుత్వ పథకాలు, సేవలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు అధికారులు ఉద్యోగులు, సిబ్బంది, గ్రామస్తులు రైతులు తదితరులున్నారు.

## 18 న బూర్జపాడు లో భగవద్గీత పోటీలు

**ఇచ్ఛాపురం, అక్టోబరు 9(వార్త):** సరస్వతి దేవి పూజ సందర్భంగా బూర్జ పాడు లో 18 న భగవద్గీత పఠన పోటీలు రాధా కృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎల్ కే జి నుంచి 10 వరకు మూడు విభాగాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. ఈ నెల 16 లోగా చంద్రశేఖర్ 7032543070 నెంబర్ కి సంప్రదించాలని కోరారు.

## కోదూరు పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టాలి



**పాతపట్నం, అక్టోబరు 9 (వార్త) :** గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావును కోదూరు పంచాయతీ ప్రజలు గురువారం కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. కోదూరు పంచాయతీ పరిధిలోని కోదూరు, ప్రహరాజపాలెం, సూర్యనారాయణపురం గ్రామాల్లో నూతన అంగన్వాడీ భవనాలు, పాఠశాలలకు ప్రహరీ గోడలు, కమ్యూనిటీ హాళ్లు, సీసీ రహదారులు, మురుగు నీటి కాలువలు, వీధిదీపాలు, చెరువు మెట్లు, స్మశాన వాటికల అభివృద్ధి మరియు తాగునీటి సౌకర్యాల ఏర్పాటు వంటి అత్యవసర పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం పంచాయతీ వద్ద అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, పనులకు తగిన అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు, ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా సమస్యల పరిష్కారానికి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల హామీ ఏమైంది?

**-ఎన్నికల హామీని అమలులో చంద్రబాబు ప్రభుత్వం విఫలం**

**- వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి ద్వజం**

**పలాస, అక్టోబరు 9 (వార్త):** బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన తెలుగుదేశం పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని చట్టబద్ధంగా అమలు చేయడంలో



విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి మండి పడ్డారు. బీసీలకు సామాజిక న్యాయం చేస్తామని చెప్పి, రిజర్వేషన్ల విషయంలో వారిని అనిశ్చితిలోకి నెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, ఆ హామీని నిలబెట్టుకునేలా అవసరమైన చట్టపరమైన చర్యలు చేపట్టాలని శిష్టు గోపి డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు అమలులోకి వచ్చినట్లుగా ప్రచారం చేసుకుంటూ ప్రభుత్వ పెద్దలు ప్రశంసలు పొందారని, అయితే న్యాయపరమైన చిక్కులు ఎదురైన నేపథ్యంలో బీసీలకు వాస్తవంగా ఎంత మేరకు ప్రయోజనం చేకూరిందనే ప్రశ్న ఉత్పన్నమవుతోందన్నారు. రిజర్వేషన్ల అంశాన్ని ప్రచారానికే పరిమితం చేయకుండా, వాటికి చట్టబద్ధమైన భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో భాగస్వామిగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీసీల రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించి పరిష్కారం సాధించేందుకు ఎందుకు చొరవ చూపడం లేదని శిష్టు గోపి ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలతో భేటీ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, బీసీల రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలంటే రిజర్వేషన్ల అమలులో న్యాయపరమైన అడ్డంకులను అధిగమించడం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేసుకుని, అవసరమైన రాజ్యాంగపరమైన, చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. రిజర్వేషన్లకు తగిన రక్షణ కల్పించే మార్గాలను పరిశీలించడంతోపాటు, రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే అంశంపై కూడా చట్టపరమైన సాధ్యాసాధ్యాలను పరిశించాలని అన్నారు. రిజర్వేషన్ల అమలుపై స్పష్టత లేకపోవడం వల్ల బీసీ వర్గాల్లో ఆందోళన నెలకొంటోందని, ఎన్నికల హామీలను నెరవేర్చకపోతే ఆ వర్గాలకు రాజకీయంగా నష్టం కలిగే ప్రమాదం ఉందని అన్నారు. గతంలోనూ బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన న్యాయపరమైన వివాదాలు తలెత్తాయని గుర్తుచేస్తూ, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా న్యాయపరమైన చర్యలు చేపట్టిన వారి విషయంలోనూ ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని ఆయన కోరారు. బీసీల హక్కుల పరిరక్షణ విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో మాటలకు, చేతలకు పొంతన ఉండాలని శిష్టు గోపి స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్ల హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం తక్షణమే కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## భవిష్యత్ విద్యుత్ అవసరాలకు సౌరశక్తే కీలకం




**పలాస, అక్టోబరు 9 (వార్త):** భవిష్యత్తులో పెరగనున్న విద్యుత్ అవసరాలను తీర్చుకోవడంతోపాటు గృహ వినియోగదారులపై విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు సౌరశక్తి వినియోగం ఎంతో అవసరమని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష అన్నారు. ప్రతి ఇంటిపై సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని, సంప్రదాయ విద్యుత్ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. స్వచ్ఛమైన ఇంధన వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడవచ్చని తెలిపారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధిలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం సేవా సేతు అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గౌతు శిరీష మాట్లాడుతూ గృహాలపై సౌర విద్యుత్ పలకల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. గృహ వినియోగదారులు తమ ఇళ్ల పైకప్పులపై సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సూర్యరశ్మి సహాయంతో విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చని శిరీష వివరించారు. దీనివల్ల నెలవారీ విద్యుత్ బిల్లులపై ఖర్చు తగ్గుతుందని, దీర్ఘకాలంలో కుటుంబాలకు ఆర్థికంగా ఊరట లభిస్తుందని అన్నారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద అర్హులైన గృహ వినియోగదారులకు నిబంధనల మేరకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక రాయితీ అందిస్తోందని తెలిపారు. సౌర విద్యుత్ పలకల సామర్థ్యం, అర్హతలు, దరఖాస్తు విధానం, బ్యాంకుల ద్వారా లభించే రుణ సదుపాయాలు, పలకల ఏర్పాటు ప్రక్రియపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు.

పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను తెలుసుకుని, అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సౌరశక్తి వినియోగం వల్ల సంప్రదాయ ఇంధన వనరులపై ఒత్తిడి తగ్గడంతోపాటు కాలుష్య ఉద్గారాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. విద్యుత్ ఉత్పత్తిలో స్వచ్ఛమైన ఇంధన వనరుల వినియోగాన్ని పెంచడం భవిష్యత్తు తరాలకు ప్రయోజనకరమని తెలిపారు. ప్రజలు సౌర విద్యుత్ పథకంపై పూర్తి అవగాహన పెంచుకుని, అందుబాటులో ఉన్న రాయితీలు, సదుపాయాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు విద్యుత్ ఖర్చులను తగ్గించడంతోపాటు పర్యావరణహిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు డి ఈ యజ్ఞేశ్వర రావు, ఏఈలు వివేకానంద, నాగభూషణరావు, పలాస కాశీబుగ్గ విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్లు, విద్యుత్ లైన్ మాన్లు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పలాస--కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధికి చెందిన కూటమి నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌లో 36 వినతులు



**పలాస, అక్టోబరు 9 (వార్త):** ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష శుక్రవారం పలాస నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె వినతులను స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రజా దర్బార్‌లో మొత్తం 36 వినతులు అందాయి. ప్రధానంగా ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు, నీటి నిల్వ ట్యాంకుల నిర్మాణం, ఉద్యోగ అవకాశాలు, మురుగునీటి కాలువల శుభ్రత, సిమెంటు రహదారుల నిర్మాణం, గిరిజన ప్రాంతాల్లో సమాచార స్తంభాల ఏర్పాటు, తక్కువ విద్యుత్తు ఒత్తిడి సమస్యల పరిష్కారం వంటి అంశాలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని పరిశీలించిన గౌతు శిరీష సంబంధిత సమస్యల తీవ్రత, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో మాట్లాడి, సమస్యలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, అందిన ఫిర్యాదులపై అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని సూచించారు. ప్రజా దర్బార్ ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం కలుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖలకు పంపించి, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో సమాచార సౌకర్యాల కొరత, తక్కువ విద్యుత్తు ఒత్తిడి వంటి సమస్యలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండాలని, వినతుల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలని సూచించారు.

పలాస నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రతి కుటుంబానికి న్యాయం అందించడం తన ప్రధాన లక్ష్యమని గౌతు శిరీష తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా పరిగణించి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. ప్రజా దర్బార్‌లో అందిన 36 వినతులపై సంబంధిత శాఖలు తీసుకునే చర్యలు, వాటి పరిష్కార పురోగతి కీలకం కానున్నాయి. ప్రజల సమస్యలు కేవలం వినతులకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పరిష్కారమయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ఈ ప్రజా దర్బార్ లో పలాస నియోజకవర్గం కూటమి ముఖ్య నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణభారతిలో ముందస్తు దసరా సంబరాలు




**ఇచ్ఛాపురం, అక్టోబరు 9 (వార్త ):** స్థానిక స్వర్ణభారతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రాంగణంలో ముందస్తు దసరా వేడుకలను ఘ నంగా నిర్వహించారు.ముందుగా స్థానిక స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మెన్ చాట్ల. తులసీదాసరెడ్డి దుర్గాదేవి చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించి అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ కార్యక్ర మంలో చిన్నారులు దుర్గా దేవి వేషాధారణ మహిషాసుర మర్ధిని నృత్య రూప ప్రదర్శన, వివిధ సాంస్కలత్రిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టకున్నాయి. ఈ కార్యక్రమంలో స్వర్ణ భారతి విద్యాసంస్థల కో- ఆర్డినేటర్ చాట్ల . నీలిమరెడ్డి, స్వర్ణ భారతి హై స్కూల్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ లీలాలక్ష్మి, ఇన్ చార్జ్ కవిత, విజయలక్ష్మి, గుణవతి తదితరులు పాల్గొన్నారు. శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో ముందస్తు దసరా వేడుకలు నిర్వహించారు .

ఈ కార్యక్రమానికి స్కూల్ చైర్మన్ డి కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఇందిరా రెడ్డి,మేనేజర్ కె.సి. పూరి ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, శంకర్, రవి, శాంతి, జయలక్ష్మి, యశోద,మీనా, ప్రమీల, స్నేహ, పార్వతి, సరోజినీ, శిరీష, ప్రియా, రాజేశ్వరి, చాందిని ఇంటరక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ డి. హర్ష వర్ధన్ రెడ్డి, సెక్రటరీ డి. భార్గవ్, యస్. పి. యల్. స్వాతి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



**మెళియాపుట్టి. అక్టోబరు 9(వార్త):** ఇటీవల టెక్కలిలో జరిగిన రైలు ప్రమాదంలో మెళియాపుట్టి గ్రామానికి చెందిన విద్యార్థి శివ మృతి చెందడంతో బాధిత కుటుంబానికి 5 లక్షల పరిహారం చెక్కు ను స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అందజేశారు. మెళియాపుట్టి మండల కేంద్రానికి చెందిన సవర కృష్ణారావు, అను దంపతుల కుమారుడు శివ రైలు ప్రమాదంలో మృతి చెందడం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. ఈ ఘటన అనంతరం శివ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆ భరోసాలో భాగంగా శుక్రవారం నాడు బాధిత కుటుంబానికి సందర్శించి 5 లక్షల పరిహారం చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ కుమారుడిని కోల్పోవడం తల్లిదండ్రులకు తీరని లోటుని, ఇటువంటి క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## న్యాయవాదుల రక్షణ చట్టం అమలుచేయాలి



**ఇచ్ఛాపురం, అక్టోబరు 9 (వార్త):** బార్ అసోసియేషన్‌కు చెందిన సభ్యులందరూ ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని ఆమోదించారు. అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ (న్యాయవాదుల రక్షణ చట్టం) అమలు చేయాలనే న్యాయమైన డిమాండ్‌తో ఈ నెల 5 నుండి 9 వరకు న్యాయస్థానంలో జరిగే విచారణలకు హాజరుకాకూడదని నిర్ణయించారు. ఈ తీర్మానాన్ని సంబంధిత జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దార్‌లకు సమర్పించాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ, సంబంధిత అధికారులందరికీ వినతిపత్రాన్ని పంపేందుకు ఇచ్ఛాపురం బార్ అసోసియేషన్ కార్యదర్శి కు అధికారం కల్పించారు. ఈ చట్టం అమలుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సహకరించాలని కూడా తీర్మానించారు. ఈ తీర్మానాన్ని తహసీల్దార్ కార్యలయం రెవిన్యూ ఇన్స్పెక్టర్ చిరంజీవి సాహు కి అందించారు.ఈ కార్యక్రమం లో అధ్యక్షులునందికి రమణయ్య రెడ్డి, సెక్రటరీ యం. రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ ప్రేమలత పట్నాయక్ సంయుక్త కార్యదర్శి మరియు మీడియషన్ ట్రైనింగ్ న్యాయవాది డి. కృష్ణ మూర్తి రెడ్డి ట్రెజరర్ ఆర్. దేవరాజు రెడ్డి, నాగరాజు పాత్రో, న్యాయవాదులు జె. కామేష్, సత్యనారాయణ పాడి, భగవాన్ దాస్, రంగారావు, జగ్గారావు రెడ్డి, ఏ. బైరి, సంతోష్, రాజేంద్ర ప్రసాద్, తరుణ్, ప్రసాద్ రెడ్డి, బి. సూర్యనారాణ పాల్గొన్నారు.

## బొడ్డపాడు పీఏసీఎస్ భవనం తొలగించండి



**పలాస, అక్టోబరు 9 (వార్త):** పలాస మండలంలోని బొడ్డపాడు గ్రామంలో చాలా సంవత్సరాలుగా వినియోగంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని తొలగించేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు వంకల కూర్మారావుకు మా తెలుగు యువత అధ్యక్షులు కిక్కిర ఢిల్లీ రావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఉన్న సహకార సంఘ భవనం పాతబడిపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో పలాస పీఏసీఎస్ అధికారులు ఇటీవల భవనాన్ని పరిశీలించారు. భవనం పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, దానిని తొలగించేందుకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని సంఘ ప్రతినిధులు కోరారు. సంబంధిత అధికారులు పరిశీలన చేపట్టిన అనంతరం ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సంచాలకుడు బొడ్డు దుష్యంత్, బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు గర్తం తులసిరావు, పలాస తెలుగుదేశం పార్టీ నాలుగో విభాగ సమన్వయకర్త మురుపింటి కుమార్‌రాజ్, బొడ్డపాడు తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు తామాడ అప్పారావు, పార్టీ సీనియర్ నాయకులు నౌగాపు గంగాధర్, బొడ్డు రవి, పోతనపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే భూసేకరణపై రైతుల అభిప్రాయాల సేకరణ

**పలాస, అక్టోబరు 9 (వార్త):** పలాస మండలం సున్నాదేవి గ్రామంలో రైల్వే భూసేకరణకు సంబంధించి రైతుల అభిప్రాయాలు, అభ్యంతరాల సేకరణకు రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్. అప్పలరాజు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో భూసేకరణ పరిహారం పెంపుతో పాటు రైతులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. భూసేకరణ పరిధిలోని రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను, పరిహారం పెంపుపై అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రైతులు లేవనెత్తిన సందేహాలకు సంబంధిత రైల్వే అధికారులతో చర్చించి వివరణలు అందించారు. భూసేకరణ ప్రక్రియలో రైతుల అభిప్రాయాలు, అభ్యంతరాలను నమోదు చేసుకోవడంపై అధికారులు దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఆర్. అప్పలరాజు మాట్లాడుతూ రైతులు తెలియజేసిన సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిబంధనలకు అనుగుణంగా పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. భూసేకరణకు సంబంధించి రైతులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటామని అన్నారు. ఈ గ్రామసభలో రైల్వే సీనియర్ విభాగాధికారులు ప్రకాష్, డేవిడ్ రాజు, పలాస తహసీల్దార్ బి. శ్రీదేవి, సంబంధిత రైతులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# అటవీ సంపద పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

**-ఎలుగుబంట్ల సంచారంపై అప్రమత్తత**

**-ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తాం**

**-కాశీబుగ్గ అటవీ ప్రాంత అభివృద్ధి, వన్యప్రాణుల రక్షణకు ప్రాధాన్యం**

**-12 వేల హెక్టార్ల అటవీ భూమి సంరక్షణే లక్ష్యం**

**-నూతన అటవీ ప్రాంతాధికారి మెట్ట మురళీకృష్ణ**



**పలాస, అక్టోబరు 9(వార్త):** కాశీబుగ్గ అటవీ ప్రాంతంలో సహజ సంపదను కాపాడటంతోపాటు వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు నూతన అటవీ ప్రాంతాధికారి మెట్ట మురళీకృష్ణ తెలిపారు. అటవీ భూముల ఆక్రమణలను అరికట్టడం, ఎలుగుబంట్ల సంచారం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడం, తీర ప్రాంతంలో పచ్చదనాన్ని పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తానని అన్నారు. కాశీబుగ్గ అటవీ ప్రాంతాధికారిగా అక్టోబరు 6న బాధ్యతలు స్వీకరించిన ఆయన, అటవీ సంపదను భావితరాలకు అందించేలా సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగనున్నట్లు వెల్లడించారు. కాశీబుగ్గ అటవీ పరిధిలో సుమారు 12 వేల హెక్టార్ల అటవీ భూమి ఉందని, ఇది పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉందని మురళీకృష్ణ వివరించారు. ఇంత విస్తారమైన అటవీ ప్రాంతాన్ని సంరక్షించేందుకు అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్థంగా వినియోగించడంతోపాటు స్థానిక ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతామన్నారు. గతంలో పాడేరు అటవీ విభాగం, శ్రీశైలం, కురుపాం, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో పనిచేసిన అనుభవంతో ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా సంరక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో ఎలుగుబంట్ల సంచారం ఉన్న చోట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పిస్తామని తెలిపారు. మనుషులకు, వన్యప్రాణులకు మధ్య ఎదురయ్యే సంఘర్షణలను తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వన్యప్రాణుల సహజ ఆవాసాలకు విఘాతం కలగకుండా చూడటంతోపాటు, ప్రజలకు ప్రమాదాలు ఎదురుకాకుండా సంబంధిత ప్రాంతాల్లో పర్యవేక్షణకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. వజ్రపుకొత్తూరు తీర ప్రాంతంలోని రక్షణ వలయంలో తాటి విత్తనాలు నాటే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తామని మురళీకృష్ణ తెలిపారు. తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనం పెంపునకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అటవీ సంపదను కాపాడటంతోపాటు సహజ వనరుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. కాశీబుగ్గ అటవీ పరిధిలో గుర్తించిన మూడు చిత్తడి నేలల హద్దులను నిర్ధారించే ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. వీటి పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. గతంలో నమోదైన వన్యప్రాణులకు సంబంధించిన కేసులు, అటవీ భూముల ఆక్రమణ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. జనసాంద్రత అధికంగా ఉండటంతో అటవీ భూములపై ఒత్తిడి పెరుగుతోందని మురళీకృష్ణ తెలిపారు. అటవీ భూములను ఆక్రమించడం, సహజ వనరులకు నష్టం కలిగించడం వంటి చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. అటవీ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అటవీ సంపద పరిరక్షణతోపాటు ఇప్పటికే నమోదైన కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. అటవీ సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తామని మురళీకృష్ణ తెలిపారు. వన్యప్రాణుల నిర్వహణకు అనువైన పద్ధతులను అమలు చేస్తామని చెప్పారు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక ప్రజల సహకారంతో అటవీ పరిరక్షణను సామాజిక బాధ్యతగా ముందుకు తీసుకెళ్తామని వివరించారు. ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో సమన్వయంతో పనిచేస్తూ అటవీ సంపదను కాపాడటం, వన్యప్రాణులకు రక్షణ కల్పించడం, పర్యావరణ సమతుల్యతను పరిరక్షించడం ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతామని మురళీకృష్ణ స్పష్టం చేశారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై టీడీపీ కట్టుబడి ఉంది

**-పార్టీ పరంగా సముచిత ప్రాధాన్యం కల్పిస్తాం**

**-ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు**



**పలాస, అక్టోబరు 9 (వార్త):** బీసీలకు 34 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్న లక్ష్యానికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని ఏపీటీపీసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వజ్జ బాబూరావు తెలిపారు. చట్టపరమైన అడ్డంకులు ఎదురైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పార్టీ పరంగా సముచిత ప్రాధాన్యం, తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని స్పష్టం చేశారు. బీసీల రాజకీయ సాధికారత కోసం తెలుగుదేశం పార్టీ గతంలోనూ పలు చర్యలు చేపట్టిందని, రిజర్వేషన్ల పరిరక్షణకు న్యాయపోరాటం చేసిందని గుర్తుచేశారు. 34 శాతం రిజర్వేషన్ల అమలుకు ఆటంకాలు ఏర్పడటంతో బీసీలకు రాజకీయంగా నష్టం జరిగిందని, రిజర్వేషన్లు అమలై ఉంటే సుమారు 16,800 మందికి స్థానిక సంస్థల్లో నాయకత్వ అవకాశాలు లభించి ఉండేవని అన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాలకు ప్రజలు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల్లో బీసీల భాగస్వామ్యాన్ని పెంచి, వారి రాజకీయ, సామాజిక అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని వజ్జ బాబూరావు తెలిపారు.

## నవరాత్రి ఉత్సవాలకు బాబా రూ.5వేల విరాళం




**పలాస, అక్టోబరు 9 (వార్త):** కాశీబుగ్గలో కార్ల నిలుపుదల కేంద్రం కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ దుర్గామాత నవరాత్రి మహోత్సవాలకు దువ్వాడ శ్రీధర్ బాబా రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అమ్మవారి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరగాలనే ఆకాంక్షతో ఈ సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కనకదుర్గమ్మ దివ్య ఆశీస్సులు పలాస నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ప్రార్థించారు. శక్తి స్వరూపిణి దుర్గామాత కృపతో ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ, పలాస నియోజకవర్గ ప్రజలకు ముందస్తు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం




**పాతపట్నం, అక్టోబరు 9 (వార్త):** పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ పాతపట్నం వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షల శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి, అవసరమైన సూచనలు మరియు ఉచిత మందులను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైకుంఠరావు, విశ్రాంత ఆప్తాల్మిక్ ఆఫీసర్ బోడ మోహనరావు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ఆర్. అనసూయ పాల్గొని విద్యార్థులకు దృష్టి లోపాలు మరియు కంటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ మధుబాబు, ఎస్ చిరంజీవి, కోశాధికారి కె చంద్రశేఖరరావు, పి రామరాజు, గెంబలి కాంతారావు, కిరణ్, ఐ మురళి, చిన్నయ్య, భరద్వాజ్, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక అభివృద్ధి కూటమి లక్ష్యం

**సోంపేట, అక్టోబరు 9 (వార్త):** సామాజిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అన్ని రంగాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మండల టిడిపి అధ్యక్షుడు కుమార్ మద్దు కుమార్, టిడిపి సీనియర్ నేత సూరాడ చంద్రమోహన్ పేర్కొన్నారు. బారువ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికల మరుగుదొడ్ల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇబ్బందికరంగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ బెందాలం అశోక్ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



## ఘనంగా ముందస్తు విజయదశమి వేడుకలు



**పలాస, అక్టోబరు 9 (వార్త):** పలాస రామకృష్ణపురంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో ముందస్తు విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలు, భారతీయ సంస్కృతిని విద్యార్థులకు పరిచయం చేస్తూ నిర్వహించిన ఈ వేడుకలు భక్తిభావాన్ని నింపాయి. విద్యార్థినీ విద్యార్థులు వివిధ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. వేడుకల్లో భాగంగా తొలుత ఓంకారంతో పాటు వినాయక ప్రార్థన నిర్వహించారు. అనంతరం దేవి అష్టోత్తరం, స్వామివారి అష్టోత్తరాన్ని భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. విజయదశమి పండుగ విశిష్టత, దాని వెనుక ఉన్న ఆధ్యాత్మిక అంతరార్థం, ధర్మంపై అధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకునే సంప్రదాయాలను వివరించారు. విద్యార్థులకు పండుగ ప్రాముఖ్యతను తెలియజేస్తూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం ఆయుధ పూజ నిర్వహించి, విజయదశమి పాటను ఆలపించారు. ముఖ్యంగా నవదేవతల నృత్యరూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు దేవతామూర్తుల రూపాలను ప్రతిబింబిస్తూ ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రార్థనలు, పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యాలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

విద్యతో పాటు సంస్కారాలు, ఆధ్యాత్మిక విలువలు, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని విద్యార్థుల్లో పెంపొందించడమే ఇటువంటి వేడుకల ప్రధాన ఉద్దేశమని ఉపాధ్యాయ బృందం తెలిపింది. విజయదశమి సందేశమైన ధర్మం, సత్యం, మంచితనం విజయాన్ని విద్యార్థులు తమ జీవితాల్లో ఆచరించాలని ఈ వేడుకలు చాటిచెప్పాయి. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి విద్యావిహార్ ట్రస్ట్ చైర్మన్ మల్లా రామే శ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి, ఉపాధ్యాయులు మురళి, అనుదీప్, చంద్రశేఖర్, కల్పన, అర్చన, ప్రవీణ, సాంబమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాజపురం హైస్కూల్లో పీఎం శ్రీ స్పోర్ట్స్ డ్రెస్ ప్రారంభం



**కవిటి, అక్టోబరు 9 (వార్త):** రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి శుక్రవారం ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరాం ప్రసాద్ పాడితో కలిసి ప్రారంభించిన ఈ కార్యక్రమం లో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్సులను అందించారు. కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ఎంఈఓ తో పాటు హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులకు ఇది ఒక గొప్ప ప్రత్యేక కార్యక్రమం అని అన్నారు. ప్రతి శుక్రవారం విద్యార్థులను స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ద్వారా వారిలో క్రీడల పట్ల మరింత అభిరుచి కలిగేలా వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీస్తూ క్రీడారంగంలో వారిని తీర్చిదిద్దేందుకు హైస్కూల్ స్థాయి నుంచి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాన్ని ఉత్సాహంగా స్వీకరించి క్రీడల పట్ల మంచి నైపుణ్యం ప్రదర్శించి వివిధ స్థాయిల్లో జరిగే పోటీలలో తమ ప్రతిభను కనబరచాలని కోరారు. ఆ విధంగా తీర్చిదిద్దేందుకు పాఠశాలలో ఉపాధ్యాయులు తగిన విధంగా సహకారం అందిస్తారని సూచించారు. క్రీడల్లో నైపుణ్యం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మెరుగైన ప్రతిభతో చక్కనైన గుర్తింపు, అలాగే ఉత్తమ భవిష్యత్తు సొంతం చేసుకునే అవకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల ద్వారా కలిగే అనర్థాలు పచ్చని మొక్కలు పెంపకం ద్వారా కలిగే ప్రయోజనాలు గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## రైళ్లలో చైన్ స్నాచింగ్.. ఇద్దరి అరెస్టు

**-22 గ్రాముల బంగారు పుస్తెల తాడు స్వాధీనం**

**-రాత్రివేళ నిద్రిస్తున్న మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చోరీలు**

**పలాస రైల్వే పోలీసుల ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడిన నిందితులు**



**పలాస, అక్టోబరు 9(వార్త):** రైళ్లలో ప్రయాణికుల మెడల్లోని బంగారు ఆభరణాలను అపహరిస్తున్న ఇద్దరు నిందితులను పలాస ప్రభుత్వ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 22 గ్రాముల బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ పలాస ప్రభుత్వ రైల్వే పోలీసు విభాగం, పలాస నేర పరిశోధన బృందం, రైల్వే రక్షక దళానికి చెందిన ప్రత్యేక బృందాలు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఈ నిందితులు పట్టుబడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం ఖుర్దా జిల్లా, జింకియా పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన సంతోష్ కుమార్ బోయ్, మనోజ్ కండి రైళ్లలో బంగారు ఆభరణాల చోరీలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. రాత్రివేళల్లో రైళ్లలో నిద్రిస్తున్న మహిళా ప్రయాణికులను, కిటికీల వద్ద కూర్చున్న వారిని లక్ష్యంగా చేసుకుని వారి మెడల్లోని బంగారు గొలుసులు, పుస్తెల తాళ్లను అపహరిస్తున్నట్లు పోలీసులు గుర్తించి నిందితులను తీసుకున్నామని పలాస జి ఆర్ పి ఎస్ ఐ శ్రీనివాసరావు వెల్లడించారు. ఖుర్దా నుంచి బరంపురం, సోంపేట మీదుగా పలాస వరకు ప్రయాణించే రైళ్లలో ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో గుర్తించామని చెప్పారు.

ప్రయాణికులు నిద్రలో ఉన్నప్పుడు లేదా వారి దృష్టి మరలిన సందర్భాల్లో ఆభరణాలను అపహరించి తప్పించుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. పలాస ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ దుంపల శ్రీనివాసరావు పర్యవేక్షణలో పలాస నేర పరిశోధన బృందం, పలాస రైల్వే రక్షక దళానికి చెందిన బృందం, విశాఖపట్నం నేర పరిశోధన విభాగం సిబ్బంది సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితులను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. పలాస ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి వారి వద్ద నుంచి 22 గ్రాముల బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. కేసుకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో పలాస ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ దుంపల శ్రీనివాసరావుతో పాటు నేర పరిశోధన బృందానికి చెందిన ఆర్‌పీసీ 411 ఎం. సంతోష్ కుమార్, ఆర్‌పీసీ 184 బి. దేవేంద్రనాథ్, పలాస రైల్వే రక్షక దళం బృందానికి చెందిన సబ్‌ఇన్‌స్పెక్టర్ టి. నిఖిల్ కుమార్, సిబ్బంది రాజుల కుమార్, సీహెచ్. శంకర్, రైల్వే రక్షక దళం నేర పరిశోధన విభాగానికి చెందిన సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం. మాల్యాద్రి, కానిస్టేబుల్ కేవీస్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సబ్‌ఇన్‌స్పెక్టర్ దుంపల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైళ్లలో ప్రయాణించే వారు తమ బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్లు, ఇతర విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రాత్రివేళల్లో నిద్రించే సమయంలో ఆభరణాలను భద్రంగా ఉంచుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రయాణికుల భద్రత కోసం ప్రత్యేక నిఘా, తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు.

## ఔట్‌సోర్సింగ్ నర్సింగ్ ఉద్యోగుల ఆందోళనకు కాంగ్రెస్ సంఘీభావం




**శ్రీకాకుళం, అక్టోబరు 9 (వార్త):** రిమ్స్ మెడికల్ కాలేజీ ఆవరణలో గత కొన్ని రోజులుగా తమ డిమాండ్లను పరిష్కరించి ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమాలు చేపడుతున్న అవుట్‌సోర్సింగ్ నర్సింగ్ ఉద్యోగులకు జిల్లా కాంగ్రెస్ పార్టీ తన సంఘీభావాన్ని తెలిపింది. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సనపల అన్నాజీ రావు నిరసన కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి మద్దతు ప్రకటించారు. చాలాకాలంగా అవుట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన బాట పట్టిన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి, వారి విజ్ఞప్తులను పరిశీలించాలని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల ఆందోళనకు మద్దతుగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మామిడి సత్యనారాయణ, జలుమూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుంట కర్ణ వీరుడు తదితరులు పాల్గొని నర్సింగ్ ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.

## నేడు మందసలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మందస, అక్టోబరు 9(వార్త):** మందస మండలంలోని ఈ నెల 10న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుల్ల యజ్ఞేశ్వరరావు తెలిపారు. మందస పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ లో మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నామన్నారు. దీంతో ఈ నెల 10వ తేదీ శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. మందస సబ్ స్టేషన్ పరిధిలోని మందసటౌన్, హట్నన్నాలి, బెల్లుపటియా, సొండిపూడి, భైరిసారంగపురం, బొగాబంద, కిల్లోయి, దేవుపురం, నర్సింగిపురం, బుడారిసింగి తదితర పరిసర ప్రాంతాల్లో మెయింటెనెన్స్ పనుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని తెలిపారు. విద్యుత్ వ్యవస్థలో అంతరాయాలు లేకుండా, మెరుగైన సేవలు అందించేందుకు ఈ నిర్వహణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకుని, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వరరావు కోరారు.

## రెండోసారి వాయిదా పడిన స్కూల్ కమిటీ ఎన్నిక

**- ఎన్నికల వాయిదాపై తల్లిదండ్రుల ఆగ్రహం.. అధికారుల తీరుపై విమర్శలు**

**- కోరం ఉన్నప్పటికీ తొలిసారి ఎన్నికలు నిలిపివేశారని తల్లిదండ్రుల ఆరోపణ**

**- పిల్లల చదువుకు మేలు చేసే వ్యక్తినే చైర్మన్‌గా ఎన్నుకోవాలని డిమాండ్**

**నరసన్నపేట, అక్టోబరు 9(వార్త):** పాఠశాల అభివృద్ధికి కీలకమైన స్కూల్ కమిటీ ఎన్నికలు రెండోసారి వాయిదా పడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఒత్తిడి కారణంగానే ఎన్నికలను వాయిదా వేస్తున్నారంటూ పలువురు తల్లిదండ్రులు ఆరోపించారు. అయితే, ఎన్నిక నిర్వహించేందుకు అవసరమైన కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు (హెచ్ఎం), మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) తెలిపారు. నిర్వహించిన ఎన్నికల సమయంలో 103 మంది హాజరైనప్పటికీ, 88 మంది మాత్రమే ఉన్నారని పేర్కొంటూ ఎన్నికలను వాయిదా వేశారని తల్లిదండ్రులు తెలిపారు. కోరం ఉన్నప్పటికీ ఎన్నికలను నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని హెచ్ఎంను ప్రశ్నించారు. రెండోసారి నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో 82 మంది మాత్రమే సంతకాలు చేయడంతో కోరం సరిపోలేదని, అందువల్ల ఎన్నికలను వాయిదా వేసినట్లు అధికారులు వెల్లడించారు. స్కూల్ కమిటీ చైర్మన్ ఎంపిక విషయంలో రాజకీయ జోక్యం తగదని తల్లిదండ్రులు స్పష్టం చేశారు. అధికార పార్టీ సూచించిన వ్యక్తినే చైర్మన్‌గా ఎన్నుకోవాలంటూ తమపై ఒత్తిడి తెస్తున్నారని కొందరు ఆరోపించారు. తమ పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేసే వ్యక్తి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్య, అవసరమైన పుస్తకాలు అందించేందుకు చొరవ చూపే వ్యక్తి చైర్మన్‌గా ఉండాలని వారు అభిప్రాయపడ్డారు. ఎన్నికలను ఎన్నిసార్లు వాయిదా వేస్తారని ప్రశ్నించిన తల్లిదండ్రులు, మరోసారి ఎన్నికలకు పిలిస్తే పరిస్థితిని పరిశీలిస్తామని పేర్కొన్నారు. తమ పిల్లలకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే ఎవరు బాధ్యత వహిస్తారని ఉపాధ్యాయులను, ప్రజాప్రతినిధులను, పోలీసులను నిలదీశారు. ఎన్నికల సమయంలో అక్రమాలు జరిగాయని, తల్లిదండ్రులు హాజరుకాకపోయినా వారి తరపున ఇతరులు వచ్చినట్లు, దొంగ ఓట్లు వేసినట్లు కొందరు ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ అందుబాటులో లేదు. ఈ ఎన్నికల ప్రక్రియలో ఎంఈవో కూడా పాల్గొన్నప్పటికీ, అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గారంటూ కొందరు తల్లిదండ్రులు విమర్శించారు. అయితే, ఎన్నికల వాయిదాపై అధికారులు కోరం కొరతనే కారణంగా పేర్కొన్నారు. తదుపరి ఎన్నికల తేదీని ఉన్నతాధికారులు నిర్ణయించిన తర్వాత నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం సుమారు 1.30 గంటల సమయంలో ఎన్నికలపై నెలకొన్న వివాదంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ స్థాయి పాలక పార్టీ నాయకులు మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. రాజకీయాలకు తమ పిల్లల చదువులను బలి చేయవద్దని ఆవేదన వ్యక్తం చేస్తూ పలువురు తల్లిదండ్రులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు కోరుతున్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546